క్లుప్తంగా

విత్తనాల మేళా

కొత్తకోట రూరల్: రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం వారి ఆధ్వర్యంలో ఈనెల 24న విత్తనాల మేళా నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి షేక్‌మున్నా తెలిపారు. ఈ మేళాలో వివిధ రకాల పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తన రకాలను విక్రయానికి అందుబాటులో ఉంటాయన్నారు. పంటల సమగ్ర సమాచారం శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని, ఆసక్తి ఉన్న రైతులు శుక్రవారం ఉదయం 10గంటలకు పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రం వద్ద చేరుకోవాలని తెలిపారు. శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు, సూచనలు పొందాలని, అదేవిధంగా అవసరం ఉన్న విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

విత్తనాల రకాలు–ధరలు

వరి ఆర్ఎన్ఆర్15048– 15కేజీ బస్తా ధర రూ.750, కేఎన్ఎం1638 – 20కిలోల బస్తా రూ.960, వేరుశనగ విత్తనం విశిష్ట– 30కిలోల బస్తా రూ.3,840, తెల్లజొన్న విత్తనం సీఎస్‌వీ41– 3కిలోల బస్తా రూ.270, పచ్చజొన్న విత్తనం పీవైపీఎస్–2 3కిలోల బస్తా రూ.450, కంది విత్తనం పీఆర్‌జీ 176– 3కిలోల బస్తా రూ.450, మినుము విత్తనం ఎంబీజీ1070 – 6కిలోల బస్తా రూ.900, పెసర విత్తనం ఎంజీజీ 385– 6కిలోల బస్తా రూ.840, ఆముదం విత్తనాలు పీసీహెచ్111– 2 కిలోల బస్తా రూ.700, ఉలవలు పాలెం– 4కిలోల బస్తా రూ.440, రాగి విత్తనాలు పీఆర్ఎస్ 38, పీఆర్ఎస్‌డబ్ల్యూ 43– 2కిలోల బస్తా 150, సజ్జ విత్తనాలు పీబీహెచ్ 1625– 2కిలోల బస్తా రూ.200, కొర్ర విత్తనాలు పీకేఎస్22 – 2కిలోల బస్తా రూ.130, అదేవిధంగా వరి విత్తనం జేజీఎల్ 24423 రకం 25 కిలోల బస్తా రూ.1,100, కంది విత్తనం పీఆర్‌జీ 176, టీడీఆర్‌జీ 59 రకం 3కిలోల బస్తా రూ.450. ఈ విత్తనాలు మేళాలో రైతులకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం వారు తెలిపినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ



అమరచింత: పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పారుతుంది. 15రోజుల నుంచి లీకేజీ ఏర్పడడంతో తాగునీటి సరఫరా సమయంలో నీరు వృథాగా పారుతూ రహదారి బురదమయంగా తయారైంది. నిల్వ నీటిలో దోమలు, ఈగలు వాలడంతో తాగునీరు కలుషితం అవుతుంది. అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బాలబాలికలకు క్రీడాపోటీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక జగ్జీవన్‌రాంనగర్‌లో బాలకృష్ణగౌడ్ ట్రస్టు ఆధ్వర్యంలో బాలబాలికలకు క్రీడాపోటీలు నిర్వహించారు. మొత్తం పది టీంలలో 50 మంది కబడ్డీ, స్కిప్పింగ్, కుర్చీలాట, పరుగుపందెం పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు, సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, కురుమూర్తి మాట్లాడుతూ బాలబాలికల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.చంద్రకాంత్, పార్టీ నాయకులు భరత్, ఈశ్వర్, ప్రశాంత, నందు, సీఐటీయూ నాయకుడు రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు ఆంజనేయులు, క్రీడాకారులు సంతోష్, ప్రభాకర్, అమ్ములు, మానవి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం శివారులో ఉన్న స్నేహఫామ్స్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ సూచనల మేరకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఫామ్స్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, యూత్‌రెడ్‌క్రాస్, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్తలు బాబుల్‌రెడ్డి, అశ్విని, చంద్రశేఖర్, అశోక్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసేమియా బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



చిన్నచింతకుంట: నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని దేవరకద్ర వ్యవసాయ సహాయ సంచాలకులు యశ్వంత్‌రావు అన్నారు. శనివారం మండలంలోని లాల్‌కోట, పర్దిపూరం, వడ్డేమాన్, చింతకుంట గ్రామాలల్లోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని సూచించారు. రైతులను మోసం చేసి కల్తీవిత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా విత్తనాలు విక్రయించి తప్పనిసరిగా రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న తదితరులు ఉన్నారు.

వార్డుల్లో పచ్చదనం



అమరచింతలోని 1వ వార్డులో పట్టణ ప్రకృతి వనం

- ఆహ్లాదాన్ని ఇస్తున్న పట్టణ ప్రకృతి వనాలు
- మున్సిపాలిటీల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

అమరచింత: జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా పట్టణ ప్రకృతి వనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వార్డుల్లో పార్కులు ఏర్పాటు చేయడంతో పచ్చదనం పరుచుకుని ప్రజలకు ఉల్లాసాన్ని కలిగిస్తున్నాయి. ఆట వస్తువులు, వాకింగ్ ట్రాకర్‌లు నిర్మించడంతో చిన్నారులతో పాటు నడివయస్సులో ఉన్న వారు వీటిలో సేదతీరుతున్నారు. మున్సిపల్ అధికారులు నిరంతరం వీటిలోని మొక్కలకు నీటిని అందిచడమే కాకుండా గడ్డివిత్తనాలను చల్లి పచ్చని గడ్డి పరుచుకునేలా చేస్తున్నారు. పట్టణ ప్రకృతి వనాల ఏర్పాటు ప్రారంభంలో ఒక్కోదానికి రూ.5నుంచి రూ.6లక్షలు మంజూరు చేసి, ఎకరం స్థలంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలు అనుకున్న విధంగా లేక పోవడంతో ఉన్న స్థలంలోనే వీటిని ఏర్పాటు చేయండని కలెక్టర్ ఆదేశించడంతో ఒక్కో దానికి సుమారు రూ.లక్షకు పైగా వెచ్చించి అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేశారు.

మున్సిపాలిటీల వారిగా ఇలా..

వనపర్తి మున్సిపాలిటీలో 33 వార్డులకు సుమారు రూ.కోటి వెచ్చించి పట్టణప్రకృతి వనాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల కాంపౌండ్ వాల్‌తో నిర్మించగా మరికొన్ని చోట్ల తీగలతో చుట్టూ ప్రహరి వేయించారు.



ఆత్మకూర్‌లో పట్టణ ప్రకృతివనం

కొత్తకోట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను ఇప్పటి వరకు 12 పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. మిగిలిన 3 వార్డుల్లో స్థలాన్ని పరిశీస్తున్నారు. వీటికోసం మున్సిపాలిటీ ద్వారా రూ.23 లక్షలు ఖర్చు చేయనున్నారు.

పెబ్బేరు మున్సిపాలిటీలో 13 వార్డులకు గాను అన్ని వార్డుల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిలో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వాటన్నింటికి మున్సిపల్ నిధుల నుంచి ఇప్పటి వరకు రూ.26 లక్షలు వినియోగించారు.

ఆత్మకూర్ మున్సిపాలిటీలో పది వార్డులకు గాను రెండేళ్ల కిందట మూడు పట్టణ ప్రకృతివనాలను నిర్మించారు. వాటి కోసం అప్పట్లో రూ.8లక్షలు వినియోగించారు. ప్రస్తుతం ప్రభుత్వ స్థలాలు ఉండడంతో మరో పది ప్రాంతాల్లో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వీటికోసం మరో రూ.10లక్షల ఖర్చు చేశామని మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

అమరచింత మున్సిపాలిటీలో పది వార్డులకు గాను మూడేళ్ల కిందట ఒకటవ వార్డులో రూ.5లక్షలతో పార్కులను ఏర్పాటు చేశారు. రెండవ, నాల్గవ, ఐదవ వార్డుల్లో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వీటికోసం సుమారు రూ.8 లక్షలు వెచ్చించారు. మిగిలిన వార్డులలో ప్రభుత్వ స్థలాలు గుర్తించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.


బాగుంది..



ఆత్మకూరు మున్సిపాలిటీలలో వార్డుల్లో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనం ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీ ప్రజలు ,చిన్నారులు వాటిలో చేరి సరదాగా గడుపుతున్నారు. ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా వుంది.

– జగదీశ్వర్ గౌడ్, ఆత్మకూర్

అన్ని వార్డుల్లో ఏర్పాటు చేయాలి



మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో కనిపించే పార్కులుగా వీటిని తీర్చిదిద్దాలి. కేవలం మొక్కలు నాటి వదిలి పెట్టడం కాకుండా చిన్నారులు, పెద్దల కోసం అవసరమయ్యే విధంగా తీర్చిదిద్దాలి.

– వెంకటేష్, అమరచింత

వీరభద్రస్వామి ఉత్సవాలు ప్రారంభం



విగ్రహాల ఊరేగింపు



లక్ష్మీగణపతి హోమంలో భక్తులు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానం పదో వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయంలో అభిషేకం, దాసంగాల సమర్పణ, లక్ష్మీగణపతి, నవగ్రహ హోమం నిర్వహించారు. మొదటి రోజు ఉత్సవాల సందర్భంగా ఆలయంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి ఆలయ ఆవరణలో భజన పోటీలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తదితరులు పేర్కొన్నారు.

నేడు అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు..

మండలంలోని మాందాపూర్‌లో భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. పోటీలకు పేర్లను నమోదు చేసుకున్న వారు సకాలంలో హాజరుకావాలని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతి రూ.60వేలు, ద్వితీయ బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.40వేలు, నాల్గవ బహుమతి రూ.30వేలు, ఐదవ బహుమతి రూ.20వేలు, ఆరవ బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

తప్పుడు అనుమతులు ఉంటే చర్యలు



అధికారులు, సిబ్బందితో వివరాలు సేకరిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

వనపర్తిటౌన్: పురపాలిక నిబంధనల ప్రకారం అనుమతి లేకుండా ఇళ్లు కట్టుకునేవారికి శాఖాపరమైన సాయం చేసేందుకు అధికారులు, సిబ్బంది చొరవ చూపాలని మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ కృష్ణ అన్నారు. శనివారం ఎల్ఈడీ లైట్ల నిర్వహణ, అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేస్తున్న వివరాలను వారు సేకరించారు. వారు మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో కొందరు తప్పుడు డాక్యుమెంట్లు నమోదు చేసి పుర స్థలాలను, డ్రెయినేజీలను కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నాయని, రహదారిని, డ్రెయినేజీని ఆక్రమించి పిల్లర్లు వేసి నిర్మాణాలు చేస్తుంటే మీరు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పుర స్థలంలో కొద్ది మేర నిర్మాణం జరిగిన పనులను ఆపేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వనపర్తి మున్సిపాలిటీలో అన్ని విభాగాల్లో కొందరు డబ్బులకు ఆశపడి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపించొద్దని, గతంలో కొందరు ప్రజాప్రతినిధులు నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేసుకున్నవారిని సైతం ఇబ్బంది పెట్టారని, అందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో కాలిపోయిన, పాడైపోయిన ఎల్ఈడీ వీధి లైట్ల స్థానంలో కొత్తగా బిగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజనీర్ సాయిచరణ్, కౌన్సిలర్‌లు చీర్ల సత్యం, రవి, కృష్ణ, గోపాల్ యాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వృథాగా నీటితొట్లు

గోపాల్‌పేట: గ్రామీణ ప్రాంతాల్లోని మూగజీవాల దాహార్తి తీర్చేందుకు డీఆర్‌డీఏ నిర్వహణలో వాటర్‌షెడ్, ఎన్ఆర్ఈజీఎస్ స్కీంల ద్వారా ఆయా గ్రామాల్లో నీటితొట్లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో సుమారు 30కిపైగా ఏర్పాటు చేసి అందులో నీరు నింపేవారు. దాదాపు పదేళ్ల క్రితం వరకు వాడిన నీటితొట్లు సాగునీరు ఎక్కువగా వచ్చి చెరువులు, కుంటలు నిండటంతో నీటితొట్లను వాడలేదు. దీంతో వాడుకలో లేకపోవడంతో ఎక్కడిక్కడ నిర్లక్ష్యానికి గురై ధ్వంసమైపోయాయి. వాటికి మరమ్మతు చేయాలని, ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని అందుబాటులోకి తీసుకురావాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కార్యదర్శులకు సమాచారం ఇచ్చాం..

నీటితొట్ల నిర్వహణను పంచాయతీవారే చూస్తున్నారు. మండలంలో ఉన్న నీటితొట్లు అందుబాటులోకి తీసుకువచ్చి నీరు నింపాలని గతంలోనే పంచాయతీలకు చెప్పాం. మైనర్ రిపేర్లు చే యాల్సి ఉన్న చోట చేసి, అందుబాటులో ఉన్నవా టిలో నీరు నింపి మూగజీవాలకు నీరందిస్తాం.

– ఉదయ్‌కుమార్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి

క్షయ నివారణపై అవగాహన



పాన్‌గల్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: మండల కేంద్రం, గోప్లాపూర్‌లో క్షయ నివారణపై వైద్య సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో జ్వరం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. గ్రామాల్లో సర్వే చేసి అనుమానితుల నుంచి పరీక్షల నిమిత్తం తెమడ సేకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంతోషమ్మ, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, నర్సమ్మ, నాగేశ్వరి, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత పూజలు



కొత్తకోటలో పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం వాసవిమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి విశేష అలంకరణ చేసి అష్టోత్తరనామాలు, అభిషేకాలు, కుంకుమార్చన శాస్త్రోత్తంగా పూజలు చేశారు. తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఎంపీపీ గుంత మౌనిక, కొండ స్వప్న, జ్యోతి, ప్రసన్నలక్ష్మి, రాజేశ్వరి, విశాల, శైలజ, రజిని, చంద్రకళ తదితరులు ఉన్నారు.

అమరచింత: వాసవిమాత జయంతి సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పూజలను నిర్వహించారు. అనంతరం సీనియర్ సిటిజన్ మహిళలకు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, సువర్ణ, స్వాతి, శ్రావణి పలువురు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లికి చెందిన చిన్నరాముడు ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందడంతో కుటుంబసభ్యులను మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. అనంతరం గ్రామ పార్టీ నాయకులతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో రూ.20వేలను వారికి అందించారు. కార్యక్రమంలో బిచ్చన్న, బీచుపల్లి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 8వ వార్డు జంగాలగుట్టకు చెందిన గగనం రాములు అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే మేఘారెడ్డిఆదేశాల మేరకు శనివారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, సతీష్, మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ కృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఎమ్మెల్యే అందించిన రూ.5వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందించారు.

గడ్డివాము దగ్ధం



మదనాపురం: మండలంలోని గోవిందహళ్లిలో శనివారం ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. గ్రామ సమీపంలో శరత్‌రెడ్డి తన గేదెల కోసం గడ్డిని కొనుగోలు చేసి నిల్వ చేశాడు. అకస్మాత్తుగా మధ్యాహ్నం వేళలో మంటలు వ్యాపించాయి. దట్టమైన పొగ మంటలతో గడ్డి నిప్పంటుకుంది. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయతి్నంచారు. అప్పటికి అదుపులోకి రాకపోవడంతో ఫైర్‌ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే నష్టం జరిగింది. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

యువకుడు అదృశ్యం

మహమ్మదాబాద్: మండల కేంద్రానికి చెందిన సజ్జు అనే యువకుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సజ్జు ఈ నెల 6న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో అతడి తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

నేలకు సారం.. పంటకు ప్రాణం



దావాజిపల్లిలో చెరువుల ద్వారా ఒండ్రు మట్టి తరలింపు పనుల్లో ఉపాధి కూలీలు

- ఉపాధి హామీ కూలీలతో చెరువుమట్టి తరలింపు
- మండలంలో జోరుగా సాగుతున్న పనులు

పాన్‌గల్: చెరువు మట్టిలో సాగు భూములకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఈ మట్టిని సాగు భూములకు తరలించడంతో నేల సారం పెరుగుతుంది. ఉపాధి హామీ కూలీలతో చెరువుల నుంచి మట్టి తవ్వించి పొలాలకు తరలిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొన్ని నెలలుగా చెరువుల్లో పూడికతీత పనులు సాగుతున్నాయి. దీంతో రైతులకు ఎరువుల వినియోగం తగ్గి పెట్టుబడికి ఎక్కువ ఖర్చు కాదు. అలాగే ఉపాధి కూలీలకు పనులు చూపినట్లు అవుతుంది.

మండల పరిస్థితి..

మండలంలోని 28 పంచాయతీల్లో 15,486 జాబ్‌కార్డులు ఉన్నాయి. మొత్తం కూలీలు 9,427 మంది ఉన్నారు. ఒండ్రు మట్టి తరలింపు పనులతో కూలీలకు పనులు లభించడం, రైతుల పొలాలకు సారవంతమైన మట్టి లభిస్తుండటంతో చాలా గ్రామాలల్లో ఉపయోగించుకుంటున్నారు. ఒండ్రు మట్టి తరలింపుతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం కూడా పెరుగుతుందని పలువురు రైతులు వాపోతున్నారు. దీనికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు ఉపయోగపడే పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.



పాన్‌గల్‌లో రైతుల పొలాల్లో ఒండ్రుమట్టి

పుష్కలంగా నత్రజని, పొటాష్..

రైతులు చెరువు మట్టిని పొలాల్లో వేసుకోవడంతో చాలా లాభాలు ఉన్నాయి. మొక్కలకు కావాల్సిన నత్రజని, పొటాష్, జింక్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. ఫలితంగా రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. నత్రజని మొక్క పెరుగుదలకు ఉపయోగపడగా, పొటాష్ తెగుళ్లను తట్టుకునే శక్తి నిస్తుంది. సెలక భూములకు చెరువు మట్టి సేంద్రియ ఎరువుగా పనిచేస్తుంది.

రైతులకు ఎంతో ఉపయోగం



ఉపాధి హామీ పథకం ద్వారా చెరువుల ద్వారా ఒండ్రు మట్టి తరలింపు రైతులకు ఎంతగానో ఉపయోగం. గ్రామాల్లో ఒండ్రు పంట పొలాలలో చల్లడం వలన కలిగే లాభాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తే చాలా మంది సద్వినియోగం చేసుకుంటారు. ఒండ్రు మట్టి తరలింపుతో పొలాలకు ఉపయోగం, చెరువుల్లో నీటి నిల్వలు మరింత పెరుగుతాయి.

లింగాల రాములు, రైతు, పాన్‌గల్

భూసారం పెరుగుతుంది



ఒండ్రుమట్టిని పొలాల్లో చల్లితే భూసారం పెరుగుతుంది. ఎక్కువ సూక్ష్మజీవులు ఉండటంతో తెగుళ్ల నివారించే శక్తి ఉంటుంది. కలియ దున్నడంతో మొక్కల ఎదుగుదలకు తోడ్పాటునిస్తాయి. చౌడు నేలల్లో ఒండ్రు చల్లడంతో పంట దిగుబడులు పెరుగుతాయి.

– సాజిద్ రహమాన్, ఏఓ, పాన్‌గల్

ఉపాధి కూలీలతో తరలింపు



వేసవిని దృష్టిలో పెట్టుకుని కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నిత్యం గ్రామాల్లో పనులను పర్యవేక్షిస్తున్నాం. వేసవిలో యాసంగి పంటకాలం పూర్తవడంతో చాలా మంది కూలీలు పనులకు వస్తున్నారు. దీంతో మండలంలోని చాలా గ్రామాల్లో సాగునీటి కాల్వల మరమ్మతులు, చెరువుల్లో ఒండ్రు మట్టి తరలింపు పనులు చేపట్టాం. తులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

కళాశాల ప్రవేశాల కోసం ఇంటింటి ప్రచారం

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆ కళాశాల అధ్యాపకులు శనివారం ఇంటింటి ప్రచారంలో నిర్వహించారు. మండలంలోని మహదేవునిపేటలో ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో పదో తరగతి చదివే విద్యార్థుల ఇంటికి వెళ్లి కళాశాల ప్రాధాన్యతను వివరించారు. అధ్యాపకులు సుప్రజాత, మదన్‌మోహన్‌రెడ్డి, ఎండీ గౌస్, నర్సింహ్మా, వెంకటయ్య, పద్మజ, వినోద్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ముగిసిన ఆరాధన మహోత్సవాలు



భజన పోటీల్లో న్యాయనిర్ణేతులుగా వ్యవహరించిన వారిని సన్మానం చేసిన సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ స్వర్ణకారుల సంఘం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులు అన్నప్రసాద వితరణ చేశారు. రెండు రోజులపాటు నిర్వహించిన భజన పోటీల్లో శ్రీవీరాంజనేయస్వామి భజన మండలి (గురుకుంట) ప్రథమ, శ్రీరాజరాజేశ్వరి భజన మండలి (మహబూబ్‌నగర్) ద్వితీయ, శ్రీశివరామాంజనేయ భజన మండలి (బోయపల్లి) తృతీయ స్థానాల్లో నిలిచాయి. దుర్గామహిళా భజన మండలి (మహ్మదాబాద్), శ్రీశివాంజనేయ భజన మండలి (కొండాపూర్) ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. అదేవిధంగా ఉత్తమ హార్మోనియంగా రాంచంద్రయ్య (బోయపల్లి), ఉత్తమ గాయకుడు నాగభూషణం (నవాబ్‌పేట), ఉత్తమ తబల బాల్‌రాజు (మహబూబ్‌నగర్) నిలిచారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం అభివద్ధి కమిటీ చైర్మన్ వడ్ల శేఖరాచారి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ, కోశాధికారి నారాయణ, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు మణికొండ నర్సింహాచారి, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు సత్తయ్యచారి తదితరులు పాల్గొన్నారు.